ప్రజల మాట ప్రగతి బాట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం

## ఆలయాలల్లో ప్రత్యేక పూజలు


కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్,అక్టోబర్ 24: విజయదశమి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో ప్రభుత్వవిప్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు పలు ఆలయాలను సందర్శించారు.ఆయా దేవాలయాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయపూజారులు శంభీపూర్‌రాజుకు ఆశార్వచనాలు అందజేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం సూరారం డివిజన్ పరిధిలోని కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆయన అనంతరం వనదుర్గమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలోని చాకరిమెట్ల ఆంజనేయస్వామి వారినిదర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెలబాల్‌రెడ్డి, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, నేతలు మహ్మద్‌రఫీ, విజయరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సగ్గిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో కార్పొరేటర్ జగన్, స్థానికులు

జగద్గిరిగుట్ట, అక్టోబర్24: ఆధ్యాత్మిక వేడుకలతో ఐక్యత, శాంతి నెలకొనాలని పలువురు ఆకాంక్షించారు. జగద్గిరిగుట్ట డివిజన్ పొలాల బస్తీ లో నిర్మిస్తున్న మల్లన్న ఆలయానికి భూమిపూజ మంగళవారం జరిగింది. కార్పొరేటర్ జగన్ అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, బస్తీనేతలు పాల్గొన్నారు.

## వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


రాంరెడ్డి(ఫైల్)

జగద్గిరిగుట్ట, అక్టోబర్24: వేర్వేరు చోట్ల ఇద్దరు వృద్ధులు కనిపించకుండా పోయారు. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రైవేటు ఉద్యోగం చేసుకునే విరుపాక రాజిరెడ్డి శ్రీనివాసనగర్‌లో తనకుటుంబంతో నివాసముంటాడు. ఇతని తండ్రి రాంరెడ్డి(83) ఈనెల 23న ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదైంది.

**అంజయ్యనగర్‌లో మరొకరు..**


తాండ్రవేణు (ఫైల్)

జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్‌కు చెందిన వృద్ధు తాండ్రవేణు(71) ఈనెల 21న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మతిమరపుతో బాధపడుతున్న అతనికోసం గాలించినా ఫలితంలేకపోయింది. దీంతో అతనికుమారుడు క్రిష్ణ పోలీసులను ఆశ్రయించగా మంగళవారం కేసు నమోదు చేశారు.

## కారు డ్రైవర్ ఆత్మహత్య

దుండిగల్,అక్టోబర్24: ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో ఓ వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా, సదాశివాపేట్, ఆరుట్లకు చెందిన కాసాల మాణిక్యరెడ్డి కుటుంబం 30 ఏండ్ల క్రితం ఉపాధి కోసం వలసవచ్చి కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో స్థిరపడింది. వీరి కొడుకు భరత్‌రెడ్డి(34) తల్లిదండ్రులతో వేరుపడి భార్య అశ్విని, పిల్లలతో కలిసి సూరారం కాలనీలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఓ ఇంటిని కిరాయికి తీసుకుని నివాసముంటున్నారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. భరత్‌రెడ్డి భార్య అశ్విని టైలరింగ్ పనులు చేస్తూ చేదోడువాదోడుగా ఉంటుంది. అయితే కొన్ని రోజులుగా సరిగ్గా పనులు దొరక్కపోవడంతో అందినకాడల్లా అప్పులు చేశాడు. అవి తీర్చేమార్గం లేకపోడవంతో మనస్థాపం చెందిన భరత్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోస్ట్‌మార్టం కోసం గాంధీవైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# మరోసారి మెజార్టీతో గెలిపించుకుందాం

### ఎమ్మెల్యే కేపి.వివేకానంద్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నేతల సమావేశాలు, ప్రచారం


నిజాంపేట్‌లోని గ్రీన్ అవెన్యూస్ కాలనీవాసులతో సమావేశమైన రంగరాయప్రసాద్, కార్పొరేటర్ రవికిరణ్

దుండిగల్,అక్టోబర్ 24: సాధారణ ఎన్నికలల్లో బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌గౌడ్‌కు మద్దతుపలికి మరోసారి గెలిపించుకుందామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వాకలపూడీ రంగరాయ ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ పరిధి, 11వ డివిజన్‌లోని గ్రీన్‌అవెన్యూస్ రెసిడెంట్స్‌తో స్థానిక కార్పొరేటర్ వాకలపూడీ రవికిరణ్‌తో కలిసి మంగళవాసం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న ఈ తొమ్మిదేండ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి వేలకోట్ల నిధులను మంజూరు చేయించి, అభివృద్ధికి పాటు పడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్‌ను మరోసారి గెలిపించుకుని అభివృద్ధికి పట్టం కడుదామన్నారు. పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలువాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. కారు గుర్తుకు ఓటువేసి ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిద్దామన్నారు. ఇందుకు కాలనీవాసుల నుంచి విశేషస్పందన లభించింది. కార్యక్రమంలో సీనియర్‌నేత, నిజాంపేట్ మాజీ సర్పంచ్ వడ్ల నగేశ్‌చారి, కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షులు రామకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.


చింతల్‌భగత్‌సింగ్‌నగర్‌లో ఓ మటన్‌షాపు వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేతలు

**చింతల్‌గత్‌సింగ్ నగర్‌లో..**

గాజులరామారం సర్కిల్, చింతల్ భగత్‌సింగ్ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎమ్మెల్యే వివేకానంద్ అభ్యర్థిత్వానికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో పత్రాలను అందజేసి బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటువేయ్యాలో వివిధ వర్గాల ప్రజలకు వివరించారు. ప్రభుత్వం గత తొమ్మిది ఏండ్లుగా చేపట్టి, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలను ప్రజలకు వివరించి మరోసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసేలా మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, కృష్ణమూర్తి, జల్దా వెంకటేశ్, వరదరాజు, ఉప్పలయ్య, చందూ, తిరుపతి, శ్యామల, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా విజయదశమి వేడుకలు..

### • పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, నిజాంపేట్ మేయర్ దంపతులు



కొంపల్లి, కుత్బుల్లాపూర్‌లోని దండమూడీ ఎన్‌క్లేవ్‌లో జరిగిన విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

దుండిగల్,అక్టోబర్ 24: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోసోమవారం విజయదశమి,దసరాపండుగ వేడుకలు వైభవంగా జరిగాయి.చెడుపై మంచి గెలుపుకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను ప్రజలు ఆనందోత్సహాలతో జరుపుకున్నారు. తెలంగాణ ప్రాంతంలోనే అత్యంత పెద్ద పుండుగ కావడంతో ఉదయం నుండే సంబురాలు మొదలయ్యాయి. నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల్లోని ప్రజలు దసరాను ఘనంగా జరుపుకున్నారు.సాయంత్రం పలు ప్రాంతాలల్లో నిర్వహించిన శమీపూజలో పాల్గొన్నారు. అనంతరం జమ్మిని తీసుకుని ఒకరికి ఒకరు పంచుకుంటూ అలాయ్‌బలాయ్ తీసుకుని పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కుత్బుల్లాపూర్, కొంపల్లి తదితర ప్రాంతాల్లో జరిగిన శమీపూజలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొనగా, నిజాంపేట్‌లో జరిగిన పూజలో మేయర్ కొలన్‌నీలాగోపాల్‌రెడ్డి పురప్రముఖులతో కలిసి పాల్గొన్నారు. అదే కుత్బుల్లాపూర్ విలేజీలోని వేణుగోపాలస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో సీనియర్ బీఆర్ఎస్ నేత కే,ఎం ప్రతాప్‌గౌడ్ పాల్గొని రావణ దహణకాండను ప్రారంభించారు. అనంతరం శాంతికి చిహ్నంగా పావురాలను ఎగురవేశారు.


నిజాంపేట్ పంచాయితీ కార్యాలయం వద్ద జరిగిన శమీపూజలో పాల్గొన్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులు, పురప్రముఖులు

## నేతలకు శుభాకాంక్షలు..

దుండిగల్,అక్టోబర్ 24: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు, యువజన, సంక్షేమసంఘాల నేతలు, అభిమానులు ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కేపీ.వివేకానంద్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులను వారి, వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నేతలను కలిసిన వారిలో పలువురు కార్పొరేటర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు


నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులను కలిసిన వివిధ కాలనీల వాసులు


ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్